ప్రజాశక్తి
గురువారం 26 జనవరి 2023

మున్సిపల్ ఉద్యోగులకు ముఖ హాజరు సరికాదు

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికులకూ ముఖ హాజరు విధానాన్ని అమలు చేయడం సరికాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హాజరు వల్ల వారిలో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. మున్సిపల్ సిబ్బందిలో ఎక్కువ మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగించలేరని, ఫోన్ వాడకంపై నైపుణ్యం లేని కార్మికులు ముఖ హాజరుతో ఇబ్బంది పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. అక్షరాస్యత లేని మున్సిపల్ కార్మికులను ఆండ్రాయిడ్ ఫోన్లు వాడమంటే ఎలా అని ప్రశ్నించారు. వారినే స్వయంగా ఎఫ్‌ఆర్‌ఎస్ తీసి పంపాలని నిబంధన విధించడం సరికాదని పేర్కొన్నారు. హాజరు పడితేనే జీతాలు వస్తాయి, ఉద్యోగాలు ఉంటాయని చెప్పి బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. తక్షణమే దీన్ని నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 15 వరకే ధాన్యం కొనుగోలు

- ఇప్పటివరకు 3,63,573 మెట్రిక్ టన్నుల సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ.534 కోట్లు జమ
- సమస్యలుంటే 1967 టోల్ ఫ్రీ నంబరుకు చెప్పాలి
- వచ్చే నెల నుంచి కార్డుకు రెండు కేజీల గోధుమపిండి
- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఫిబ్రవరి 15వ తేదీ వరకే ధాన్యం కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో నవంబరు చివరి వారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించామన్నారు. 371 రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 3,63,575 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించి రూ.534 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశామన్నారు. రవాణా, హమాలీ, గోనె సంచులు తదితర వాటికి రూ.4.35 కోట్లను జమ చేశామని వివరించారు. రైతుల నుంచి మిల్లర్లు తూకం కంటే ధాన్యం అదనంగా డిమాండ్ చేస్తున్నారని, డబ్బులూ అడుగుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

ఇటువంటి సమస్యలు ఉంటే రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 1967కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనంతో పాటు రైసు మిల్లులకు రైతులు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతుల ధాన్యం మిల్లులో దించకపోతే, మిల్లు వద్ద నియమించబడిన కస్టోడియన్ అధికారి దగ్గర ఉండి సంబంధిత రైతు ధాన్యాన్ని దించేలా చేయిస్తారని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో తేమ శాతం, తూకం తదితరమైనవి నమోదు చేసినవే ఖరారు చేయబడతాయన్నారు. తరుగు, తేమ శాతం, తూకం సరిపోలేదని మిల్లర్లు అదనంగా ధాన్యం గానీ, డబ్బులు గానీ అడిగితే రాతపూర్వక ఫిర్యాదు అందితే సంబంధిత మిల్లరుకు ఇవాల్సిన బకాయిల నుంచి మినహాయించి, రైతు ఖాతాకు నేరుగా జమ చేస్తామని స్పష్టం చేశారు. రైతుల ఫిర్యాదుల మేరకు కొన్ని మిల్లులకు జరిమానా విధించామని, ఒక మిల్లును మూసివేశామని తెలిపారు.

వచ్చే నెల నుంచి కార్డుకు రెండు కేజీల గోధుమపిండి

రేషన్ కార్డుదారులకు కిలో రూపాయి చొప్పున ఇస్తున్న బియ్యాన్ని ఈనెల నుంచీ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస, శ్రీకాకుళం మండలాల్లోని 64,415 కార్డుదారులకు కేజీ రూ.16 చొప్పున రెండు కేజీల గోధుమ పిండిని ఫిబ్రవరి నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి, డిఎస్ఒ వెంకటరమణ పాల్గొన్నారు.

ఓటు హక్కుతో నిర్ణయాత్మక శక్తి

- అర్హత గల వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ఓటరు గుర్తింపు కార్డులతో విద్యార్థులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు నిర్ణయాత్మక శక్తిగా నిలుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు కళాశాలల విద్యార్థులు, ఓటర్లు, అధికారులు, సిబ్బంది నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ ఎంతో విశిష్టత కలిగి ఉందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటింగ్‌పై నిర్లిప్తత ఉండరాదని, బాధ్యతతో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. యువత అంతా ఉద్యమ రూపంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ ప్రక్రియలో యువత నిర్ణయాత్మక శక్తిగా ఉండాలని 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించడమైందని చెప్పారు. మన భవితను నిర్దేశించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు కీలకమన్నారు.

ఓటరు నమోదులో యువత భాగస్వామ్యం అవసరమని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఓటు హక్కు ఆవశ్యకతను తెలుసుకుని ప్రతిఒక్కరూ దేశాభివృద్ధి కోసం విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్‌డిఒ బి.శాంతి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓటు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పలు కళాశాలల విద్యార్థులు ఓటు హక్కును వివరిస్తూ ప్రదర్శించిన స్కిట్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం నూతనంగా ఓటు హక్కు కలిగిన యువతకు ఓటరు కార్డులను అందజేశారు. ఉత్తమ సేవలు కనబరచిన బిఎల్‌ఒలకు, ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వయో వృద్ధులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారితో కలెక్టర్, జెసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డ్వామా ఎపిఒ కె.వి అప్పలనాయుడు, ప్రభుత్వ పురుషుల, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎ.మోహన్‌రాజు, శ్రీరాములు, సన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాజ్, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, పలు కళాశాలల అధ్యాపకులు, రెవెన్యూ అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల పేరుతో వేధింపులు

- ఎన్ఎఫ్‌పిఇ జిల్లా అధ్యక్షులు జ్యోతీశ్వరరావు
- పోస్టాఫీసు ఎదుట ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా కోటి కొత్త పోస్టల్ ఖాతాలను తెరవాలని, ఫిబ్రవరి 9, 10 తేదీల్లో 7.5 లక్షల కొత్త సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరవాలని లక్ష్యాలను నిర్దేశిస్తూ తపాలా శాఖ విడుదల చేసిన ఉత్తర్వులతో కిందిస్థాయి ఉద్యోగులు మానసిక వేదనకు గురవుతున్నారని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు జ్యోతీశ్వరరావు అన్నారు. దీన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్టల్‌లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించి పదేళ్లు కావస్తున్నా, సరైన నెట్‌వర్క్ సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దీంతో ఉద్యోగులు ప్రజానీకానికి మెరుగైన సేవలు అందించలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. దీనికితోడు అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యం కాని లక్ష్యాల పేరుతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. లక్ష్యాలు పూర్తి చేయని వారికి పనిష్మెంట్లను విధిస్తూ మానసికంగా వేధిస్తున్నారని చెప్పారు.

ఉద్యోగుల సంక్షేమానికి, రోజువారీ పోస్టాఫీసు కార్యకలాపాలకు సంబంధించిన నిధులు కొన్ని నెలలుగా మంజూరు చేయకుండా పోస్టల్ డైరెక్టరేట్ ఉన్నతాధికారులు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులతో సంఘ నాయకులు చర్చించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళన చేయాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాబూరావు, రమేష్, రాంబాబు, గౌరీ, నారాయణరావు, పాత్రో, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ప్రదర్శనకు సిద్ధమైన శకటాలు
- 18 ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు
- సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టనున్న విద్యార్థులు

వేడుకలను సిద్ధం చేసిన మైదానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం ముస్తాబు అయింది. పతాకావిష్కరణతో పాటు సైనిక వందన స్వీకరణకు వేదికను సిద్ధం చేశారు. జిల్లా అభివృద్ధిని ప్రతిబింబించేలా పలు ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు లబ్ధిదారులకు ఉపకరణాలు అందించేందుకు బ్యాంకర్లు, పలు సంక్షేమ రంగాలకు చెందిన ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన 18 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేశారు.

మువ్వన్నెల పతాకాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఎగురవేయనున్నారు. పతాకావిష్కరణ అనంతరం ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి సైనిక వందనాన్ని స్వీకరిస్తారు. అందుకోసం ప్రత్యేక శకటాన్ని సిద్ధం చేశారు. పోలీసుల సైనిక వందనం, విన్యాసాల ప్రదర్శన అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రధాన వేదిక ముందర ఈ కార్యక్రమాలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులను ప్రత్యేక ఆహ్వానితులుగా పిలుస్తున్నారు. అధికారులు, వీక్షకులు కూర్చునేందుకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేశారు. అనంతరం జిల్లా అభివృద్ధిని తెలియజెప్పేందుకు ఐటిడిఎ, డిఆర్‌డిఎ, అటవీశాఖ, పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖ, డ్వామా, వైద్యారోగ్య, విద్యాశాఖలతో పాటు మొత్తం 18 శకటాలను ప్రదర్శనకు సిద్ధం చేశారు. వాటిలో ఉత్తమ శకటాలకు బహుమతులు అందజేస్తారు. జిల్లావ్యాప్తంగా 72 ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 216 మంది ఉద్యోగులను ప్రశంసిస్తూ వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలను అందజేస్తారు. జిల్లా ప్రగతిని, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రసంగించనున్నారు.

ఏర్పాట్లు పరిశీలన

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. పరిశీలించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సిద్ధం చేసిన వేదికతో పాటు పెరేడ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై సూచనలు చేశారు. వేదిక, ప్రదర్శన స్టాల్స్, సిట్టింగ్, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించిన ఆయన ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డిఒ బి.శాంతిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.వెంకటరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు డి.వి విద్యాసాగర్, ఎం.కిరణ్ కుమార్, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

221 మందికి ప్రశాంసా పత్రాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రిపబ్లిక్ డే వేడుకలను పురస్కరించుకుని అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలకు చెందిన 221 మందికి గురువారం ప్రశాంసాపత్రాలను అందజేయనున్నారు. వీరిలో 72 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 216 మందిని ఎంపిక చేయగా, ఐదు స్వచ్ఛంద సంస్థల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపికైన అధికారుల్లో మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, ఎన్ఆర్ఇడిసిఎపి జిల్లా మేనేజర్ ఐ.వి సుబ్రమణ్యం, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు, జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు ఉన్నారు. స్వచ్ఛంద సంస్థల్లో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ వి.జగన్నాథం నాయుడు, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ఫౌండేషన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.సురేష్, జెమ్స్ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో సేవలందించిన ప్రభాకర్, కళ్లేపల్లి సంప్రదాయ గురుకులంలో కూచిపూడి బోధిస్తున్న కె.యామిని ఉన్నారు.

జిల్లాలో అత్యుత్తమ సేవలందించిన రెండు గ్రామ సచివాలయాలను రిపబ్లిక్ డే ప్రశాంసాపత్రాలకు ఎంపిక చేయడం విశేషం. వాటిలో సంతబొమ్మాళి మండలం పాత నౌపడ, పోలాకి మండం చీడివలస సచివాలయాలు ఉన్నాయి.

కబడ్డీ విజేత శ్రీకాకుళం

ప్రజాశక్తి - విజయనగరం

అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కబడ్డీ విజేతగా శ్రీకాకుళం జట్టు నిలిచింది. బాలురు, బాలికల విభాగంలో శ్రీకాకుళం జట్లు రాష్ట్రస్థాయి విజేతగా నిలిచాయి. బాలికల విభాగంలో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం (54 పాయింట్లు), కర్నూలు (52 పాయింట్లు)పై విజయం సాధించి విజేతగా నిలిచింది. చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టును విజయం వరించింది. ఆ జట్టులో జెర్సీ నంబర్ 9 కెప్టెన్ విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించింది. అనంతరం జరిగిన బాలుర ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు (43 పాయింట్లు), విజయనగరం (23 పాయింట్లు)పై విజయం సాధించింది.

బాలురు విభాగంలో విజయనగరం జట్టు, బాలికల విభాగంలో కర్నూలు జట్టు రన్నర్‌గా నిలిచాయి. బాలుర విభాగంలో మూడో స్థానంలో ప్రకాశం, నాలుగో స్థానంలో విశాఖ జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు మూడో స్థానం, విజయనగరం నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పిటిసి జి.సన్యాసినాయుడు, ఎంపిపి ఎ.సుధారాణి, వైస్ ఎంపిపిలు ఎస్.వైకుంఠరావు, పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో సులభతర విధానాలతో సేవలు

- ప్రభుత్వ పథకాల అమలుకు తోడ్పాటు
- కిసాన్ క్రెడిట్ కార్డులపై దృష్టిసారించాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సులభతర విధానాలను అనుసరిస్తూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలందించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ బ్యాంకర్లకు సూచించారు. జిల్లా సంప్రదింపుల మండలి (డిసిసి), జిల్లాస్థాయి సమీక్షా మండలి (డిఎల్ఆర్‌సి) సమావేశాన్ని నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలుకు బ్యాంకులు తోడ్పాటు అందించాలన్నారు. వెనుకంజలో ఉన్న బ్యాంకులు లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకానికి మత్స్య శాఖ ద్వారా దరఖాస్తు చేసుకున్న ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకునేలా బ్యాంకర్లు సహకరించాలని కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, టిడ్కో గృహ నిర్మాణ రుణాలనూ లబ్ధిదారులకు సకాలంలో మంజూరు చేయాలన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుల జారీలో లక్ష్యాలను అధిగమించకపోవడంపై కారణాలను తెలుసుకున్నారు. రైతులకు ఎంతో మేలు చేకూర్చే ఈ కార్డులను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రూ.కోటి నుంచి రూ.10 కోట్ల లోపు గల చిన్నతరహా పరిశ్రమలకు, రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల పెట్టుబడి గల మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు రుణాలను మంజూరు చేయాలన్నారు. రబీ, ఖరీఫ్ పంట రుణాలనూ సకాలంలో మంజూరు చేయాలని చెప్పారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాన్ని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ పథకం లక్ష్యాలను నెరవేర్చడానికి బ్యాంకులు సహకరించాలన్నారు. అభివృద్ధి పథంలో జిల్లా ముందుకు వెళ్లేందుకు బ్యాంకర్ల సహకారం అవసరమన్నారు. నగదు రహిత లావాదేవీలు జిల్లాలో శతశాతం అమలయ్యేలా ఫైనాన్షియల్ లిటరసీ ప్రోగ్రాంను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. సమావేశంలో డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ జి.వి.బి.డి హరిప్రసాద్, ఆర్‌బిఐ ఎల్‌డిఒ అనిల్ కుమార్, యుబిఐ డిప్యూటీ రీజనల్ అధికారి దుర్గాప్రసాద్, నాబార్డు డిడిఎం వరప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రసాదరావు, పలు బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటారు వాహన ప్రమాద కేసులు ఎక్కువగా రాజీ చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని జిల్లా కోర్టులో గల జిల్లా జడ్జి ఛాంబరులో పలు ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ స్టాండింగ్ కౌన్సిల్, మోటారు వాహన ప్రమాద కేసుల్లోని కక్షిదారుల న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ప్రమాద కేసుల్లో లోక్ అదాలత్‌లో రాజీ కావడం వల్ల కక్షిదారులకు ధనం, సమయం వృథా కావని, సత్వర న్యాయం లభిస్తుందన్నారు.

లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులపై అప్పీలుకు అవకాశం లేదన్నారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసుకోవాలని కోరారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి తిరుమల వెంకటేశ్వర్లు, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యూ ఇండియా, యునైటెడ్ ఇండియా, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, ఎపిఎస్ ఆర్‌టిసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

వార్త... 6వ పేజీలో

పర్యాటక ప్రదేశాలకు జిల్లా నెలవు

జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు

శ్రీకాకుళం : పర్యాటక ప్రదేశాలకు శ్రీకాకుళం నెలవు అని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరంలో పర్యాటకశాఖ ఆధ్వర్యాన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాలతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రదేశాలు జిల్లాలో చాలా ఉన్నాయన్నారు. అవి అభివృద్ధి చెందితే ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధి చెందితే గిరిజనులకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించి, వారి జీవన ప్రమాణాలు మరింత మెరుగవుతాయని ఆకాక్షించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రతిఒక్కరూ సందర్శించి పర్యాటకాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం సింగ్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, నెహ్రూ యువ కేంద్రం సమన్వయ అధికారి కె.వి ఉజ్వల్, గీతా శ్రీకాంత్, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టిసితో సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఆర్‌టిసి బస్సులతో సురక్షిత ప్రయాణం అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద శ్రీకాకుళం రెండో డిపోకు చెందిన రెండు నూతన బస్సులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా ప్రతి పల్లెకూ రవాణా కనెక్టివిటీ పెంచినట్లు తెలిపారు. ఎపిఎస్ ఆర్‌టిసిని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వపరం చేసి ప్రజా రవాణా సంస్థగా మార్చిందన్నారు. దీంతో సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందారని తెలిపారు. సంస్థ పురోగతికి అహర్నిశలు సిబ్బంది కృషి చేసి, ప్రయివేటు రవాణా వ్యవస్థకు ధీటుగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ కె.మాధవ్, రెండో డిపో ట్రాఫిక్ మేనేజర్ గంగరాజు, రమేష్, చైతన్య, వైసిపి నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, పి.చిన్నారావు, సాధు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బస్సును ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు టెక్కలి

IPNO. 04/2022

Between:
యండమూరి కృష్ణంరాజు --పిటిషనర్
And:
1. పెద్దిన కర్రెన్న
2. రాగోటి సూర్యనారాయణ
3. పిల్లల అప్పన్న
4. గుర్రాల సహదేవ్
5. బిర్లంగి సురేష్
6. రెయ్యి నరసమ్మ
7. ఉలాస రామమూర్తి
8. ముద్దాడ లక్ష్మణ
9. రొక్కం రామారావు --రెస్పాండెంట్స్

పై నెంబర్ కేసులో పిటిషనర్ అయినా **యండమూరి కృష్ణంరాజు, పెద్దిన కర్రెన్న** మరియు 8 మంది మీద **insolvancy petition** వేసి యున్నారు. పై పిటిషన్‌లో ఎవరైనా ఇంకా అప్పులు ఇచ్చిన ఎడల **తేదీ 02-02-2023**న కోర్టు ముందు వచ్చి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

వెల్లమల అప్పలనాయుడు
అడ్వకేట్,
కోటబొమ్మాళి

తేదీ:25-01-2023
టెక్కలి

ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ అనురాధ

'రెడ్డీస్' సేవలు అభినందనీయం

డిఎంహెచ్‌ఒ అనురాధ

ప్రజాశక్తి - రణస్థలం

సామాజిక సేవా కార్యక్రమాలలో విశేషంగా సేవలు అందిస్తున్న డాక్టర్ రెడ్డీస్ సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనురాధ అన్నారు. రణస్థలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.22 లక్షలతో డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ నూతనంగా నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం టిబి రోగులకు మందులతో జిల్లాలోని 595 మంది టిబి రోగులకు రూ.700 విలువ గల పౌష్టికాహార కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా విపత్కరమైన పరిస్థితుల్లో డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. అదే సందర్భంలో సిబ్బంది శ్రమించి విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ సీనియర్ మేనేజర్ కె.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ఆక్సిజన్ ప్లాంట్లు ఏర్పాటు చేసి రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పరిశ్రమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. తమ పరిశ్రమ విద్య, వైద్యం, ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి సీతారాం, ఆస్పత్రిలోని పలు మౌలిక సమస్యలు పరిష్కరించాలని, రోగులకు కుర్చీలు బెంచీలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ యాజమాన్యానికి కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ప్రతినిధులు వి.రామజోగారావు, సురేష్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

శ్రీకాకుళం అర్బన్ : జాతీయ స్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ (నాలెడ్జ్ అసెసమెంట్ టెస్ట్) పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన ఈ పరీక్షలో ఆరు నుంచి పదో తరగతి వరకూ చదవుతున్న విద్యార్థులు సెకెండ్ లెవల్లో 103 మంది ఎంపికైనట్టు స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. మేథ్స్ విభాగం నుంచి 44 మంది, ఫిజిక్స్ విభాగం నుంచి 26 మంది, కెమిస్ట్రీ విభాగం నుంచి 33 మంది విద్యార్థినీ విద్యార్థులు సెకెండ్ లెవెల్‌కు అర్హత సాధించారని తెలిపారు. వీరిలో 23 మంది విద్యార్థులు నగదు పారితోషికాన్ని అందుకున్నారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా శ్రీచైతన్య పాఠశాలల రీజియన్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, జోనల్ అకాడమిక్ డీన్ పి.మోహన్‌బాబు అభినందించారు.

గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

బాల్ బ్యాడ్మింటన్‌లో గోల్డ్ మెడల్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రస్థాయిలో 23, 24 తేదీల్లో అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల విభాగంలో కాశీబుగ్గ జెడ్‌పి స్కూల్‌కు చెందిన ప్రియమణి, జోత్స్న గోల్డ్ మెడల్ సాధించారు. ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి పాలవకుండా జాతీయస్థాయి అర్హత సాధించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ క్రీడలు ఆడే వారిని ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాల అధిరోహించి మాతృభూమికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెడతారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.టి.రావు, జాతీయ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు మధుబాబు, ఇరిగేషన్ పి.శ్రీనివాసరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఉపేంద్రరెడ్డి, సభ్యులు హేమసుందర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఎచ్చెర్ల మండలం కుశాలపురం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓసియాక్ శాండ్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రొడక్షన్ సిబ్బంది సాజిన్, సరున్, సురేష్, విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి సహకారంలో నిర్వహిస్తున్న శిబిరంలో ప్రముఖ ఇఎన్‌టి, తల, మెడ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.కె.బాలకృష్ణన్ వైద్య సేవలందించనున్నారని పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని గనులు, భూగర్భశాఖ డిప్యూటీ డైరక్టర్ డి.పణిభూషణ్‌రెడ్డి ప్రారంభిస్తారని, గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ జి.వి.స్వామినాయుడు పాల్గొనున్నారని చెప్పారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుందని, అందరూ దీనిని వినియోగించుకోవాలని కోరారు.

అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి

ఆమదాలవలస : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

పొందూరులో...

కొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అంగన్వాడీల ఫేస్ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పట్టణంలోని సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ఒత్తిడి గురిచేస్తూ మానసికంగా వేధించడం తగదన్నారు. రకరకాల యాప్‌లను తీసుకువచ్చి అంగన్వాడీలపై పనిభారం పెంచడం మానుకోవాలన్నారు. సకాలంలో జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. విధుల్లో మృతి చెందిన అంగన్వాడీల కార్యకర్త, ఆయా కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 6న అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని తెలిపారు. సిడిపిఒ కె.బాలామణి అందుబాటులో లేకపోవడంతో అనంతరం డేటా ఎంట్రీ ఆపరేటర్ పాణికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, జి.భారతి, బి.లక్ష్మి, కె.జ్యోతి, లక్ష్మీబాల, అన్నపూర్ణ, నాగమణి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి ప్రాజెక్టు కార్యాలయం వరకూ అంగన్వాడీలు ర్యాలీలు నిర్వహించారు. అనంతరం సిడిపిఒ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నంబూరి షణ్ముఖరావు, సంఘం అధ్యక్షులు బి.రవణమ్మ, కార్యదర్శి బి.సింహాచలం, రాజేశ్వరి, అరుణ, లక్ష్మి, భారతి, జయ, పద్మ, కాంతం, నారాయణమ్మ పాల్గొన్నారు.

కొత్తూరు : ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇందుమతి, శ్రీలత, సరస్వతి, కళ్యాణి, జలజాక్షి, మధులతలు పాల్గొన్నారు.

పలాస : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఐసిడిఎస్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.మంజులకుమారి, యూనియన్ నాయకులు కె.జ్యోతి, బి.ఇందుమతి, పి.పద్మావతి, తులసమ్మ, కృష్ణవేణి, పి.పద్మావతి, మల్లేశ్వరి, అలివేణి పాల్గొన్నారు.

పొందూరు: అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్. అమ్మన్నాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పొందూరు అంగన్వాడీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియూ ఆధ్వర్యాన అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్‌లో కూడిన వినతి పత్రాన్ని ప్రాజెక్డు కార్యాలయం అధికారులకు అందించారు. ఆర్.చంద్రమౌళి, ఉమాదేవి, ఎస్.రమణమ్మ, డి.రమాదేవి, రాధిక, లక్ష్మి పాల్గొన్నారు.

మందస : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

కోటబొమ్మాళిలో...

టెక్కలి రూరల్ : ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

మందస : అంగన్వాడీలకే ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ మందస ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, అంగన్వాడీలు వి.హేమలత, ఎన్.హైమావతి, బి.శ్యామలాకుమారి, జి.రాజేశ్వరి, బి.హేమలత, టి.రాధమ్మ, ఉమాసుందరి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, అంనగఆవడీ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు.

రాజీనామా చేసి ఎన్నికలకు రావాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్

పరామర్శిస్తున్న రవికుమార్

పొందూరు: ప్రజాస్వామ్యబద్ధంగా పాదయాత్రలు చేసే వారిపై ఆంక్షలను పెట్టి ప్రతిపక్షాలను అణిచివేయాలని చూస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలనను ప్రజలు అంతమొందించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని రాపాక, సింగూరు, మొదలవలస, కనిమెట్ట, పిల్లలవలస గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుబూతుపరుల కుటుంబాలను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, షర్మిల పాదయాత్రలతో పాటు విజయమ్మ సభలకు ఎటువంటి ఆంక్షలు పెట్టకుండా పోలీసుల సెక్యూరిటీ కల్పించామన్న విషయాన్ని గుర్తుతెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల తల్లి విజయమ్మ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు పాదయాత్ర చేసుకునే స్వేచ్ఛ ఉందని, ఆంక్షలు పేరుతో అడ్డుకుంటే అది ప్రజాస్వామ్య ప్రభుత్వం ఎలా అవుతుందని, నియంతృత్వ ప్రభుత్వం అవుతుందని స్వయంగా అన్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న నీకు తల్లి, చెల్లి మాటలు లెక్కచేయవని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించవని, తాతా రాజారాడ్డి రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తే... ప్రజలు ఎవరూ హర్షించరని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి నాయకులు కొంచాడ అప్పలనాయుడు, కొంచాడ సన్యాసిరావు, కొంచాడ మనోహరరావు, ప్రకాశరావు, కోటీశ్వరరావు, రమణ, రాంబాబు, మోహనరావు, తమ్మినాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉషాపద్మ

కాకినాడ ఆదిత్య విద్యార్థిని ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థిని జాతీయ యువజనోత్సవాల్లో ప్రతిభ చాటింది. ఇటీవల కర్ణాటకలోని హుబ్బులి దార్వాడ్‌లో నిర్వహించిన 26వ జాతీయ యువజనోత్సవాల్లో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని కుమారి ఎ.ఉషాపద్మ ఏకపాత్రాభినయ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ఈ యువజనోత్సవాల్లో తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభతో ప్రథమ స్థానం కైవసం చేసుకోవడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు కళాశాలల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి, సెక్రెటరీ సుగుణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు, డైరెక్టర్ బి.శ్రీనివాసచక్రవర్తి అభినందించారు.

మాట్లాడుతున్న రాజు

రైల్వే గేట్ సమస్యపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని రక్తకన్న రోడ్డు ఉన్న రైల్వే ఎల్‌సిగేట్ వల్ల గంటల తరబడి ప్రజలు పడుతున్న బాధలపై ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించేందుకు సంతకాల సేకరణ చేస్తున్నామని జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే గేట్ సమస్యపై ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ రైల్వే గేట్ వల్ల ప్రతి 15 నుంచి 20 నిమిషాలకు ట్రైన్ రావడంతో చుట్టుపక్కల ఉన్న వెయ్యి గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. జనసేన వీర మహిళలు, నాయకులతో కలిసి ఈ నెల 27 నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి సంతక సేకరణ చేస్తామని తెలిపారు. ఈ నెల 30న ఖుర్దా డివిజన్‌కు చెందిన భువనేశ్వర్‌లో ఉన్న రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లి అండర్ పాస్ వే ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కోరుతామని తెలిపారు. సమావేశం జనసేన జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, మత్స్యకార రాష్ట్ర కార్యదర్శి నాగుల హరి బెహరా, రొక్కల భాస్కర్‌రెడ్డి, సంతోష్ మహరణ, ఢిల్లీ బిసయి, కల్య గౌడు, కుమార్ రాజు, బాలరాజు, దొంబూర్ మోహన్ పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దజాలారిపేటకు చెందిన అరసవల్లి గొల్లబాబుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హత్య నేరం రుజువు కావడంతో బుధవారం జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు పూర్వపరాలు పరిశీలిస్తే... 12 ఏప్రిల్ 2017న మధ్యాహ్నం 12 గంటల సమయంలో గొల్లబాబు తన భార్య పద్మావతిని కత్తిపీతతో నరికేసి చంపేశాడని తలయారీ బలగ పోలయ్య ఫిర్యాదికి ఫోన్ చెప్పారు. ఫిర్యాది జాలారిపేట వెళ్లి చూడగా... పద్మావతి మృతి చెంది ఉంది. ఎలా మృతి చెందిందో ఫిర్యాదు తెలుసుకున్నాడు. ముద్దాయి మద్యం తాగి హత్య చేసినట్లు గుర్తించారు. వెంటనే శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ వై.ప్రసాదరావు కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ ఆర్.అప్పలనాయుడు దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జిషీటు వేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో గొల్లబాబుకు జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు కేసు వాయిదించారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న శంకర్

యువగళానికి సంఘీభావ యాత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టబోయే యువగళం పాదయాత్రకు సంఘీభావంగా నగరంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ముందుగా నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం లోకేష్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం నగరంలోని జిటి రోడ్డు, ఉమెన్‌కాలేజి రోడ్, పసగాడ మిల్లు కూడలి మీదుగా అరసవల్లి వరకు పాదయ్యా నిర్వహించారు. టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీరాజ్యం, దొండపాటి నవీన్ రెడ్డి, మూకళ్ల శ్రీను పాల్గొన్నారు.

చిప్స్‌ను తీస్తున్న విద్యార్థులు

విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన బుధవారం శ్రమదానం చేశారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో ఉన్న అపరిశుభ్రతను తొలగించి, ప్లాస్టిక్ కవర్లు దహనం చేశారు. నాడు-నేడు పనుల్లో భాగంగా కళాశాల ప్రాంగణంలో మార్గానికి అడ్డంగా ఉన్న చిప్స్ సరిచేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యమన్నారు. విద్యార్థి దశ నుంచే యువకులు దీనిపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పిఒ జె.పాపారావు, నర్సింహ కుమార్‌దాస్, జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, కె.కరుణశ్రీ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులు విధుల బహిష్కరణ

పలాస : పలాస కోర్టు ఆవరణలో కాకినాడలో సీనియర్ మహిళా న్యాయవాది అన్నపూర్ణపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ పలాస బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండ్ర మురళి, కార్యదర్శి పిండి వెంకటరావు మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు విశ్వేశ్వరరావు, రాజరత్నం నాయుడు, పి.లక్ష్మీనారాయణ, జిఎంఎస్ అనిల్ రాజ్, ఎస్.వి.రమణ, హేమకుమార్, బి.కె.ఆర్.పట్నాయక్, కోత రజనీకుమార్, ఖాళిదాస్, చంద్రశేఖర్, విఘ్నేశ్వరుడు, మోహనరావు, చిట్టిబాబు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు సన్మానం

పోలాకి : ఆంధ్రప్రదేశ్ శిష్టకరం వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుణి కృష్ణను డైరెక్టరుగా కొనసాగించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను బుధవారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎపి శిష్టకరణ సంఘం జాయింట్ సెక్రటరీ ఉరిటి రాధాకృష్ణన్, జిల్లా సంఘం కోశాధికారి ఉరిటి కిరణ్‌బాబు, వెంకటరఘు, ఉరిటి జగన్నాథ రావు, అంపలాం వసంతకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక

కోటబొమ్మాళి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (3జిఎఫ్) అండర్-17, 14 బాలబాలికల విభాగంలో ఫెన్సింగ్ క్రీడల రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నిమ్మాడ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పాగోటి రామకృష్ణ బుధవారం తెలిపారు. ఈనెల 27 నుంచి 29 వరకు కర్నూలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడకు అండర్-17 విభాగంలో కొంచాడ కోటమ్మ, రెయ్యిల హరికృష్ణ ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే అండర్-14విభాగంలో రేగులపాటి కళ్యాణి, కొంచాడ కోటమ్మ, ఇప్పిలి తేజేస్వినిలు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థుల ఎంపికపై ఉపాధ్యాయులు గండేపిల్లి శ్రీనివాస్, పీడీ కె.అనితశ్రీ అభినందనలు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఓటు హక్కుపై అవగాహన అవసరం

టెక్కలి రూరల్ : ప్రతిజ్ఞ చేయిస్తున్న రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పండగలో పాల్గొన్నంత ఉత్సాహంతో ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడూ ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఓటరు చైతన్య సదస్సులో పాల్గొని మాట్లాడారు. భారత ఎన్నికల కమిషన్ ఒక స్వతంత్ర వ్యవస్థలో పనిచేస్తుందని, పటిష్టమైన మన ఎన్నికల నిర్వహణా విధానానికి ఇతర దేశాలు సైతం ప్రసంశిస్తున్నాయని చెప్పారు. సమావేశంలో ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, టెక్కలి తహశీల్దార్ టి.కిషోర్‌కుమార్, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, సిఎస్ఈ హెచ్ఒడి డాక్టర్ యు.డి.ప్రసన్న పాల్గొన్నారు.

టెక్కలి : ప్రతిఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలని సబ్ కలెక్టర్ తాటిమూకల రాహుల్‌కుమార్ రెడ్డి సచించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహింఆచరు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు కిషోర్, శ్రావన్, నిరంజన్, ప్రసాద్, విఆర్ఒ, బిఎల్ఒలు పాల్గొన్నారు. మండలంలోని నర్సింగపల్లి, బోప్పాయిపురం, పాతనౌపడా, పరశురాంపురం, పంచాయితీ పరిధిలోని సర్పంచ్‌లు రౌతు జయమోహన్, గుజ్జు మోహన్‌రెడ్డి, దల్లి సంధ్యారాణి, కె.కామేశ్వరరావు ఆధ్వర్యాన, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బి.సతీష్‌కుమార్, లూక్‌పాల్, కందిగొల్ల, కె.శ్రీనివాసరావు, త్రినాథరావు, లీలావరప్రసాద్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని ఆర్‌డిఒ టి.సవరమ్మ అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం నుంచి వన్ వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బొమ్మలాట శ్యాంసుందర్, జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు, తహశీల్దార్ ఎస్.గణపతి, ఎన్నికల డిటి మురళీధర్ నాయక్ పాల్గొన్నారు.

జలుమూరు: ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ అధికారులు జూనియర్ కళాశాల విద్యార్థుల చే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ జి.వి.రవికుమార్, ఆర్ఐ సతీష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహనా ర్యాలీలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, జెడ్‌పిటిసి జి.ఎండయ్య, ఎఎస్ఐ బి.అప్పన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారిని సుమబాల ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం నుంచి రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ గురుప్రసాద్, డిటి శంకరరావు, రెవెన్యూ అధికారి శ్రావణకుమార్, విఆర్ఒ రాజారెడ్డి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాబిన్ కుమార్ పాడి నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ, సంతోష్, సీతమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పొందూరు : ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపిడిఒ

జి.సిగడాం : ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలోని అద్దానంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన విద్యార్థుల చే అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతమ్మ పాల్గొన్నారు.

కవిటి: ఓటు వజ్రాయుధమని తహశీల్దార్ రాచర్ల అప్పలరాజు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూ, ఎస్వీజె విద్యార్థులుకవిటిలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డిటి టి.రామచంద్రరావు, రీ సర్వే డిటి బి.ఈశ్వరరావు, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ పాణిగ్రాహి, పి.సత్యనారాయణ, ఎం.భాస్కరరావు, బి.జగ్గారావు పాల్గొన్నారు.

పోలాకి: విద్యార్థి దశ నుంచే ఓటుహక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సిఎస్ డిటి పి.శ్రీనివాసరావు అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అన్నపూర్ణరావు ఆధ్వర్యాన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ కోటీశ్వరరావు, సూపరింటెండెంట్ కృష్ణారావు పాల్గొన్నారు.

రణస్థలం : ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల విద్యార్థులతో జాతీయ రహదారిపై ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం పాల్గొన్నారు.

నందిగాం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, బిఎల్ఒలు విద్యార్థులచే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం డిటి ఎం.భాగ్యలక్ష్మి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.

పలాస : ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు ఆధ్వర్యాన జంట పట్టణాల్లో విద్యా వాహిని కళాశాల విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, డిటి రవి, విఆర్ఒ ఖగేశ్వరరావు, విద్యా వాహిణి కళాశాల డైరెక్టర్ తిరుమలరావు పాల్గొన్నారు.

పొందూరు: యువత ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి సక్రమంగా వినియోగించుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని రాపాకలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నూతనంగా ఓటు హక్కు పొందిన యువతతో కలిసి కొత్తగా మంజూరైన ఓటు కార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి నాయకులు అప్పలనాయుడు, సన్యాసిరావు, మనోహరరావు, ప్రకాశరావు, మోహనరావు, కోటీశ్వరరావు, రమణ, శ్రీనివాసరావు, తమ్మినాయుడు పాల్గొన్నారు.

పలాస : ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు ఆకృతిలో విద్యార్థులు కూర్చుని బాధ్యతను చూపారు. సివిక్స్ అధ్యాపకుడు బెలగాన ప్రసాదరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బాడ వెంకటమోహన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినేని పాపారావు పాల్గొన్నారు. అలాగే కాశీబుగ్గ ఎస్వీఎస్వైఎం డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ఆవశ్యకతపై వివరించారు. కార్యక్రమంలో టి.ప్రవీణకుమారి పాల్గొన్నారు.

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సరుబుజ్జిలి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పదునైన ఆయుధమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన పిఒ దుగ్గివలస రాంప్రసాద్ విద్యార్థుల చే మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధనుంజయరావు, చిన్నారావు, లైబ్రేరియన్ రామారావు, రమేష్‌సాహు, వినోద్‌రాజు, శ్రీనివాసరావు, విజయ, సంగీత, అప్పలనాయుడు, కమలాకరరావు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

లావేరు : ఓటర్ల దినోత్సవం సందర్భంగా కెజిబివి విద్యార్థినులతో మురపాక శాఖాగ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సుధ, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పొందూరు : ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సీపాన హరిహరరావు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సువ్వారి మధు, అధికారులు, సచివాయం సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్పీకర్ సీతారాం

వైసిపిలోకి పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ పరిధిలోని సరుబుజ్జిలి మండలం సింధువాడకు చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన ఊటపల్లి రాజారావు, నరసింహమూర్తి, కృష్ణారావు, మీసాల తవితయ్య, కెల్లి రామారావు, దాసరి ఈశ్వరరావు, రాజారావు, ఊటపల్లి శంకరరావు తదితర 18 కుటుంబాలు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. ఈ మేరకు స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం బుధవారం వైసిపి పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతో తామంతా వైసిపిలోకి చేరినట్లు తెలిపారు. స్పీకర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో నిలదొక్కుకునేలా పాటుపడుతున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్ కామేశ్వరి, మండల వైస్ ఎంపిపి శివానంద, పొందూరు వైస్ ఎంపిపి వండాన వెంకటరావు, సూరపునాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసూన కుమారి

డిసిసిబి సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

డిసిసిబి బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పొందూరు డిసిసిబి బ్రాంచి మేనేజర్ వి.ప్రసూనకుమారి అన్నారు. డిసిసిబి బ్యాంకు ఆవరణంలో బుధవారం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రాంచి పరిధిలో సుమారు రూ.106 కోట్లు ఆర్థిక లావాదేవీలను నిర్వహిస్తున్నామని, అలాగే రూ.15 కోట్లు గోల్డ్‌లోన్లు అందజేశామని తెలిపారు. బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీని అందజేయడం తో పాటు, బ్యాంకు రుణాలపై తక్కువ వడ్డీని వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం గురుగుబెల్లి శ్యామలరావు జగనన్న తోడు పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిసి సత్యనారాయణ, సూర్యప్రభ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జి హరిత

చట్టాలపై అవగాహన

టెక్కలి : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత కోరారు. టెక్కలి కోర్టు ఆవరణలో చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగంలో మారుతున్న పరిణామాలను అవగాహన చేసుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ఆవరణలో రంగోలీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి తేజచక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంజీవిని ధర్మరాజు, కార్యదర్శి ఎస్.సూర్యరాజు, న్యాయవాదులు ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, దివ్వల వివేకానంద, వైకుంఠరావు పాణిగ్రాహి, పేడాడ బాబూరావు, దాడి ధర్మారావు, విశ్వజ్యోతి, ఎస్‌విఆర్‌కె జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కవిటి: మండలంలోని బెజ్జిపుట్టుగలో శ్రీచక్రధర యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

బుధవారం జరిగిన పోటీల్లో ప్రగడపుట్టుగ బివైఆర్, బెజ్జిపుట్టుగ, బల్లపుట్టుగ జట్లు ముందంజలో ఉన్నాయి. సర్పంచ్ ఎస్.పి.నారాయణ స్వామి, శ్రీచక్రధర యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రయివేటీకరణ నిర్ణయానికి స్వస్తిపలికి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నడిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ఉక్కు పరిరక్షణ పేరిట బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అనేక పోరాటాలు చేసి, 36 మంది ప్రాణ త్యాగం చేసి సాధించుకున్నారని పేర్కొన్నారు. 26 వేల ఎకరాల భూములను ప్రజలు త్యాగం చేశారని అన్నారు. వారి

నిరాహార దీక్ష చేస్తున్న సిపిఐ నాయకులు

త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కును కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా అమ్మేందుకు ప్రయత్నిస్తోందన్నారు.

తక్షణమే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈనెల 30న విశాఖలో లక్ష మంది కార్మికులతో కార్మిక మహాగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి మద్దతుగా ఈ నెల 23 నుంచి జిల్లాలో నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సనపల నర్సింహులు, చాపర సుందర్‌లాల్, పి.ప్రభావతి, నీలవేణి, బలగ రామారావు, డోల శంకరరావు, అనపాన షణ్ముఖరావు, కొమర భాస్కరరావు, పి.అప్పారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ జగనన్న తోడు రుణాలు

మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని వీధి వ్యాపారస్తులు, చిల్లర వర్తకులు, తోపుడు బండ్లు నడుపుకునేవారు, ఏ విధమైన చిన్న వ్యాపారస్తునకైనా పెట్టుబడి సహాయానికి ప్రభుత్వం అందరికీ జగనన్న తోడు రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఎపిఎం కూర్మారావు

మేనేజర్ బి.ఎ.ఎన్.మూర్తి సమక్షంలో ఫీల్డ్ ఆఫీసర్స్ పీడీ రాంప్రసాద్, డి.జయశ్రీ దరఖాస్తులను పరిశీలించి రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీలకు అప్పులు వాడుకోకుండా ఉండేందుకు ప్రభుత్వమే వడ్డీ భరిస్తూ... జగనన్న తోడు పథకం కింద బ్యాంకుల ద్వారా రూ.పది వేలు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు సంవత్సరం లోపు వాయిదాల ప్రకారం అసలు చెల్లించుకుంటే వడ్డీ ప్రభుత్వమే భరిస్తున్నట్లు వివరించారు. గతంలో లబ్ధి పొందిన వారు, వాయిదాలు సక్రమంగా చెల్లించిన వారు తమ సచివాలయాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, రోజాలత, చందరరావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ తనిఖీ

పోలాకి: పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్లిపేట సెక్రటేరియట్‌లో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌ను టెక్కలి డిప్యూటీ డిఎంహెచ్‌ఎఒ డాక్టర్ లక్ష్మీతులసి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రోగులకు ఈ హెల్త్ క్లినిక్‌ల ద్వారా 14 రకాల డయాగ్నోస్టిక్ ర్యాపిడ్ కిట్లు, 67 రకాల మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీదేప్, డాక్టర్ సాయిలత, వైద్య సిబ్బంది ఎస్.ఈశ్వరమ్మ, సుమతి, శ్రావణి, సూర్యనారాయణ, ఎఎన్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పొందూరు: గ్రామీణులకు 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రమేష్‌నాయుడు అన్నారు. మండలంలోని గోకర్ణపల్లిలో బుధవారం హెల్త్‌వెల్‌నెస్

పోలాకి : శిబిరాన్ని పరిశీలిస్తున్న లక్ష్మీతులసీ

కేంద్రంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్, ఎఎన్‌ఎం చిన్నమ్మడు, ఎంఎల్‌హెచ్‌పి కవిత, హెల్త్ అసిస్టెంట్ తవిటిరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీమంతం చేస్తున్న డాక్టర్ అంజలి

స్టాఫ్‌నర్సుకు సీమంతం

వజ్రపుకొత్తూరు: మండలంలోని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న దాసుపురం రేవతికి వైద్యాధికారి డాక్టర్ అంజలి, గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన పిహెచ్‌సి ఆవరణలో బుధవారం సీమంతం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ ప్రతి మగువకు మాతృత్వం పొందే క్రమంలో సీమంతం ప్రాధాన్యత సంతరించుకుం టుందన్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, గర్భిణి తాను ఆహారం తీసుకుంటూ బిడ్డకు పోషకాలు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నెలలు నిండిన సమయంలో వైద్యులు పర్యవేక్షణలో ప్రసవం జరగాలని సూచించారు. సిబ్బంది కళ్యాణి, అనురాధ, భవాని, పూలకుమారి, శిల్ప, రమాభాయి, దివ్య, అనూష, సుధ, రాధ, మహాలక్ష్మి, మౌనిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా అమలు చేయాలి

పలాస : ఐదు కోట్ల ఆంధ్రులను మోసం చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక హోదా, విభజన హామీల అమల కోసం అనంతపురంలో బుధవారం సమరయాత్ర ప్రారంభమైందని, దీనిని విజయవంతం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక కాశీబుగ్గ జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థి యువజన సంఘాలు సమావేశం బుధవారం నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. వచ్చే నెల 4న జిల్లాకు చేరుతున్న ప్రత్యేక హోదా బస్సు సమరయాత్రను అన్ని విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.మురళి, కె.శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు కృష్ణ, వల్లభరావు, తిరుపతి, వెంకటరమణ, మోహన్, యువరాజ్ పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యాన బుధవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీలకు 30 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు గణతంత్ర దినోత్సవం బహుమతులను అందజేయనున్నారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమిలి రాజేష్, మండల కార్యదర్శి పడాల నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లక్ష్మి

సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి- పొందూరు

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా సమయ పాలన పాటించాలని పొందూరు సెక్టార్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి సూచించారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణంలో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. సమావేశంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న కృష్ణదాస్

గాతలవలసలో 'గడప గడపకు'

ప్రజాశక్తి- పోలాకి

ప్రజా సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పద్మప్రియ అన్నారు. మండలంలోని గాతలవలసలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ కణితి సత్తిబాబు, రెంటికోట త్రినాథరావు, చింతాడ ఉమ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న హమాలీలు

హమాలీల ఆందోళన

ప్రజాశక్తి- కంచిలి

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ పాయింట్ల వద్ద పనిచేస్తున్న హమాలీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు కంచిలిలో హమాలీలు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు దుర్యోధన, జిల్లా కార్యదర్శి గోవిందరావు మాట్లాడారు. 12 నెలలుగా వేతన సవరణ చేయకపోగా తమ హక్కులను కాలరాసే విధంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్లకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తున్నామని అన్నారు. కూలీలకు వేతనాల సవరణ చేయకపోగా ఉన్న హమాలీలను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27, 28 తేదీల్లో హమాలీల హక్కుల సాధన కోసం ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పరామర్శిస్తున్న శివాజీ

శివాజీ పరామర్శ

ప్రజాశక్తి - పలాస

మండలంలోని కేసుపురానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు కోనారి పున్నయ్య రెండో కుమారుడు కొనారి రామారావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ బుధవారం మృతుడు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, గురుటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, తమ్మినేని గంగారం, సప్ప నవీన్, తమ్మినేని ధనుంజయ, ఐటిడిపి మండల అధ్యక్షుడు ఆరియాపల్లి ప్రభుదాస్, బూర్ల విజయ్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

'క్యాంపస్ క్రాఫ్స్'ను ఏర్పాటు చేయాలి

కోటబొమ్మాళి: ప్రతి కళాశాలలో విద్యార్థులచే క్యాంపస్ క్రాఫ్స్‌ను ఏర్పాటు చేయించాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి కళాశాలలలోనూ ఈ క్యాంపస్ క్రాప్‌ను టీమ్‌లను ఏర్పాటు చేయడం వల్ల పోలీసులతో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో వంశధార, అదిత్య, విక్టరి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

మినప పంటలో 'పెస్ట్ సర్వేలైన్'

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో మినప పంటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెస్ట్ సర్వే లైన్ కార్యక్రమాన్ని మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. పంటల్లో వచ్చే తెగుళ్లు, పురుగులపై సమగ్రంగా నిఘా పెట్టడమే పెస్ట్ సర్వే లైన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ విధంగా పంటల్లో ప్రతివారమూ సర్వే లైన్స్ చేపట్టి పంట స్థితి, పంటల్లో ఏవైనా వచ్చే తెగుళ్లు, పురుగులు వచ్చినట్లయితే వాటికి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మెరుగైన పద్ధతులను రైతులకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, కృష్ణవేణి, మల్లేష్ పాల్గొన్నారు.

పెస్ట్ సర్వేలైన్ నిర్వహిస్తున్న సిబ్బంది